# తండాల అభివృద్ధి ఘనత కేసీఆర్‌దే

- పనిచేసే నేతలనే గెలిపించుకోవాలి
- ప్రతిపక్ష పార్టీల అడ్డగోలు వాగ్దానాలకు మోసపోవద్దు
- గిరిజనులకు మంత్రి సత్యవతి పిలుపు
- గిరిజనులంటే రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఇష్టం: ఎమ్మెల్సీ కవిత
- నిజామాబాద్‌లో బంజారా భవనానికి శంకుస్థాపన



నిజామాబాద్ జిల్లా కేంద్రంలో రూ.1.5 కోట్లతో నిర్మించిన బిగాల కృష్ణమూర్తి పట్టణ ఆర్యవైశ్య సంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సత్యవతి రాథోడ్. చిత్రంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్యేలు బిగాల గణేశ్‌గుప్తా, బాజిరెడ్డి గోవర్ధన్

డిచ్‌పల్లి/ఖలీల్‌వాడి, అక్టోబర్ 01: రాష్ట్రంలో మారుమూల తండాలను గ్రామపంచాయతీలుగా మార్చి.. వాటిని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని గిరిజన, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పాంగ్రా శివారులో రూ.3 కోట్లతో నిర్మించనున్న బంజారా భవన నిర్మాణానికి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌తో కలిసి ఆదివారం ఆమె భూమి పూజ చేశారు. అనంతరం సమీపంలోని ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ.. 2014 నుంచి కేసీఆర్ పాలనలో గిరిజనలకు స్వర్ణయుగం వచ్చిందని తెలిపారు. గిరిజనుల హక్కులు, వారి అభివృద్ధికి కోసం మనసుపెట్టి పని చేసే ముఖ్యమంత్రి భారతదేశంలో ఎవరైనా ఉన్నారా అంటే అది కేసీఆర్ ఒక్కరేనని స్పష్టం చేశారు. ఈ మాటను తాను మంత్రిగా చెప్పడం లేదని, ఒక గిరిజన బిడ్డగా చెప్తున్నానని తెలిపారు. 3,196 తండాలను పంచాయతీలుగా మార్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని కొనియాడారు. గిరిజనుల గురించి వీరి కంటే ఎక్కువగా ఆలోచించే నాయకుడు సీఎం కేసీఆర్‌ను పదికాలాల పాటు కాపాడుకునే బాధ్యత ఈ జాతిపై ఉం దని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌కు గిరిజనులంటే ఎంతో ఇష్టమని చెప్పా రు. కల్యాణలక్ష్మి పథకం గిరిజనుల నుంచే వచ్చిందని, ఉద్యమ సమయంలో కేసీఆర్ వరంగల్‌లో పర్యటిస్తున్నప్పుడు.. ఓ తండాలో రేపు పెండ్లి ఉందనగా గిరిజనుడి ఇల్లు కాలిపోగా.. బాధితుడు చెప్పిన మాటలు విని కల్యాణలక్ష్మి పథకానికి రూపకల్పన చేశారని వివరించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా బంజారాలకు 10 శాతం రిజర్వేషన్ అమలు చేశారని పేర్కొన్నారు. తెలంగాణ వచ్చాకే గిరిజనుల జీవితాల్లో వెలుగులు నిండాయని చెప్పారు. రైతు బీమా, రైతు బంధు, పోడుపట్టాలు అందించిన ఘనత తెలంగాణదేనని స్పష్టం చేశారు. 60 ఏండ్లు పాలించిన వారు ఏమీ చేయలేదని, కేవలం తొమ్మిదేండ్లలోనే తెలంగాణ ఎంతో అభివృద్ధి సాధించిందని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో గిరిజనుల అభివృద్ధికి సీఎం కేసీఆర్ ప్రాధాన్యం ఇస్తున్నారని పునరుద్ఘాటించారు. అనంతరం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నిర్మించిన పట్టణ ఆర్యవైశ్య సంఘం బిగాల కృష్ణమూర్తి భవనాన్ని ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యేలు బిగాల గణేశ్ గుప్తా, బాజిరెడ్డి గోవర్ధన్‌తో కలిసి మంత్రి సత్యవతి ప్రారంభించారు. ఆర్యవైశ్య సంఘానికి 1.5 కోట్లు మంజూరు చేశామని, ఆర్యవైశ్యులకు అండగా ఉంటామని ఎమ్మెల్సీ కవిత తెలిపారు. నగరాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న ఎమ్మెల్యే బిగాలను మరోసారి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు.

# కేసీఆర్‌తోనే ఆలయాలకు పూర్వ వైభవం

- దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- ఆధ్యాత్మికతను కాపాడేది బ్రాహ్మణులే
- విద్యుత్తు శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి
- సూర్యాపేట జిల్లా కేంద్రంలో విప్రహిత బ్రాహ్మణ సదన్ ప్రారంభం



బ్రాహ్మణ సదన్ భవనానికి ఎకరం స్థలాన్ని ఉచితంగా ఇచ్చిన డాక్టర్ ఏ రామయ్య కుటుంబసభ్యులను సన్మానిస్తున్న మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, సముద్రాల వేణుగోపాలాచారి తదితరులు

సూర్యాపేట, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోనే రాష్ట్రంలోని దేవాలయాలకు పూర్వ వైభవం వచ్చిందని దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో రూ.2.50 కోట్లతో నిర్మించిన విప్రహిత బ్రాహ్మణ సదన్‌ను విద్యుత్తు శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ.. అర్చక ఉద్యోగులకు అత్యుత్తమమైన వేతన వ్యవస్థ ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని చెప్పారు. బ్రాహ్మణుల సంక్షేమం కోసం బ్రాహ్మణ పరిషత్‌ను ఏర్పాటు చేసి ఏటా రూ.100 కోట్లు కేటాయిస్తున్నారని తెలిపారు. విదేశాల్లో చదువుతున్న బ్రాహ్మణుల పిల్లలకు రూ.20 లక్షల చొప్పున ఆర్థిక సాయం, అర్చకులకు గౌరవ వేతనాలు పెంచడం.. బ్రాహ్మణుల పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఉన్న ప్రేమకు నిదర్శనమని స్పష్టం చేశారు. దేశంలోనే తొలి బ్రాహ్మణ సదన్ హైదరాబాద్ గోపన్‌పల్లిలో నిర్మించగా.. ఆ తరువాతి స్థానం సూర్యాపేటకే దక్కిందని తెలిపారు. అనంతరం విద్యుత్తు శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచంలో ఆధ్యాత్మికతకు పుట్టినిల్లు భారతదేశమని, అలాంటి ఆధ్యాత్మికతను నిలబెట్టడంలో బ్రాహ్మణుల పాత్ర ఎంతో గొప్పదని చెప్పారు. సమైక్య పాలనలో నిరాదరణకు గురైన బ్రాహ్మణులు, రైతులను సీఎం కేసీఆర్ ఆదుకుంటున్నారని తెలిపారు. దేశంలో ఆధ్యాత్మికతను బ్రాహ్మణులు కాపాడుతుంటే.. వారికి సీఎం కేసీఆర్ చేయూత ఇస్తున్నారని వివరించారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సదన్ భవనానికి ఖరీదైన ఎకరం స్థలాన్ని ఉచితంగా ఇచ్చిన డాక్టర్ ఏ రామయ్య, ఆయన కు టుంబ సభ్యులను మంత్రులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ అధ్యక్షుడు కేవీ రమణాచారి, తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వేణుగోపాలాచార్యులు, బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ సభ్యుడు సముద్రాల వేణుగోపాలాచారి, యా దగిరిగుట్ట ప్రధానార్చకుడు లక్ష్మీనర్సింహాచార్యులు, జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావ్, దేవాదాయ శాఖ కమిషనర్ వీ అనిల్‌కుమార్, తెలంగాణ బ్రాహ్మణ సమాజం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు చకిలం రాజేశ్వర్‌రావు, సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

# పప్పు ధాన్యాల ఉత్పత్తిని పెంచాలి

- పప్పుల వినియోగం పెరిగింది..
- విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తున్నది
- రాయితీపై శనగపప్పు పంపిణీ మంచి నిర్ణయం
- 'భారత్ దాల్' ఆవిష్కరణలో మంత్రి నిరంజన్‌రెడ్డి



ఆదివారం రాయితీ శనగపప్పు పంపిణీని ప్రారంభిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి, కేంద్ర వినియోగదారుల శాఖ కార్యదర్శి రోహిత్ కుమార్‌సింగ్, హాకా చైర్మన్ శ్రీనివాస్‌రావు


హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): దేశంలో పప్పుల వినియోగం పెరిగిందని, అదే సమయంలో ఉత్పత్తి భారీగా తగ్గిపోయిందని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి చెప్పారు. ఫలితంగా దేశ అవసరాల కోసం విదేశాల నుంచి పప్పు దినుసులు దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. దీనిని నివారించాలంటే దేశంలో పప్పు ధాన్యాల ఉత్పత్తి పెంపునకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థ హాకా 'భారత్ దాల్' పేరుతో పంపిణీ చేస్తున్న రాయితీ శనగపప్పు కార్యక్రమాన్ని ఆదివారం హెచ్ఐసీసీలో కేంద్ర వినియోగదారులశాఖ కార్యదర్శి రోహిత్ కుమార్‌సింగ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పంపిణీ వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మధ్యతరగతి, పేద వినియోగదారులకు ఇది ఎంతో మేలు చేస్తుందని చెప్పారు. బహిరంగ మార్కెట్లో కిలో రూ.90 విలుగల శనగపప్పును రూ.60కే అందించడంపై అభినందించారు.

### హాకాకు ప్రభుత్వ సపోర్ట్ భేష్

కేంద్ర వినియోగదారులశాఖ కార్యదర్శి రోహిత్‌కుమార్ సింగ్ మాట్లాడుతూ రాయితీ శనగ పప్పు పంపిణీకి సంబంధించి తొలుత తమ జాబితాలో హాకా లేదని తెలిపారు. హాకా చైర్మన్ మచ్చా శ్రీనివాస్‌రావు వినతి మేరకు అవకాశం ఇచ్చామని, ఇక్కడికి వచ్చి హాకా పనితీరు, తెలంగాణ ప్రభుత్వ మద్దతు చూశాక హాకాపై మరింత నమ్మకం పెరిగిందని చెప్పారు. సబ్సిడీకి అందే శనగపప్పు అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హాకా చైర్మన్ శ్రీనివాసరావు, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, హాకా ఎండీ సురేందర్, జీఎం రాజమోహన్ పాల్గొన్నారు.

# దేశంలో నంబర్‌వన్ సెక్యులర్ లీడర్ కేసీఆర్

- గాంధేయ మార్గంలో తెలంగాణ సాధించిన నేత
- హోం మంత్రి మహమూద్ అలీ
- మైనార్టీలను ఓటు బ్యాంకుగానే చూసిన కాంగ్రెస్: మంత్రి వేముల



నిజామాబాద్ జిల్లా లక్కోరా ముస్లింలకు మజీద్ అభివృద్ధి నిధుల ప్రొసీడింగ్ కాపీలను అందజేస్తున్న మంత్రులు మహమూద్ అలీ, ప్రశాంత్‌రెడ్డి. చిత్రంలో ఎంపీ సురేశ్‌రెడ్డి

కమ్మర్‌పల్లి, అక్టోబర్ 1 : దేశంలోనే నంబర్ వన్ సెక్యులర్ లీడర్ సీఎం కేసీఆర్ అని హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. తెలంగాణలో గంగా జమునా తెహజీబ్‌లా కేసీఆర్ పాలన సాగుతున్నదని కొనియాడారు. పేద ముస్లిం పిల్లలకు విరివిగా గురుకుల పాఠశాలలు, జూనియర్ కాలేజీలు ఏర్పాటు చేసి వారు సైతం ప్రపంచంతో పోటీ పడేలా కేసీఆర్ తీర్చిదిద్దుతున్నారని అన్నారు. నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం లక్కోరాలో ఏఎన్‌జీ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ ముస్లిం మైనార్టీలకు మజీద్‌ల అభివృద్ధి కోసం రూ.3 కోట్ల నిధుల ప్రొసీడింగ్ కాపీలను ఆదివారం హోం మంత్రి మహమూద్ అలీ, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహమూద్ అలీ మాట్లాడుతూ గాంధేయ మార్గంలో తెలంగాణను సాధించి అనతి కాలంలోనే దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దినట్టు చెప్పారు. మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ ముస్లిం పిల్లలు విద్యలో ప్రపంచంతో పోటీ పడాలనేదే కేసీఆర్ ఆకాంక్ష అన్నారు. వారు డాక్టర్లు, ఇంజినీర్లు, పైలట్లు, సైంటిస్టులు, మేధావులుగా ఎందుకు కాకూడదనే ఉద్దేశంతో గురుకుల పాఠశాలలు నెలకొల్పినట్టు చెప్పారు. రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ మైనార్టీలకు పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. 300 కుట్టుమెషిన్లను మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్‌తో కలిసి పంపిణీ చేశారు. అనంతరం మంత్రి వేముల బాల్కొండ మండలం చిట్టాపూర్‌లో రూ.149 కోట్లతో చేపట్టిన బాల్కొండ, చిట్టాపూర్, సుర్బిర్యాల్ ఎత్తిపోతల పనులకు శంకుస్థాపన చేశారు.హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మధు శేఖర్, బీఆర్ఎస్ రాష్ట్ర నేత కోటపాటి నర్సింహనాయుడు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో సీఎం అభ్యర్థుల లొల్లి!

- మధ్యప్రదేశ్ సీఎం అభ్యర్థిని ప్రకటించిన రాహుల్ గాంధీ
- అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో రేగిన చిచ్చు!
- ఇతర రాష్ట్రాల నుంచీ ఇలాంటి డిమాండ్ వస్తే ఎలా?
- పార్టీ వర్గాల ఆందోళన.. అధిష్ఠానంపై పెరుగుతున్న ఒత్తిడి
- తెలంగాణ, రాజస్థాన్ రాష్ట్రాల్లో గ్రూపు రాజకీయాలు
- ఎవరికి వారే ముఖ్యమంత్రి అభ్యర్థులుగా ప్రకటనలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): ఈ ఏడాది ఆఖరులో తెలంగాణతో పాటు మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్, మిజోరం రాష్ట్రాల అసెంబ్లీల ఎన్నికలు జరుగనున్నాయి. అయితే వీటిలో ఒక్క మధ్యప్రదేశ్‌కు మాత్రమే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సీఎం అభ్యర్థిని ప్రకటించి పార్టీలో 'సీఎం అభ్యర్థుల' తేనెతుట్టెను కదిపారు. మాజీ సీఎం కమల్‌నాథ్‌ను సీఎం అభ్యర్థిగా రాహుల్ శనివారం భోపాల్ సభలో ప్రకటించారు. దీంతో ఇతర రాష్ట్రాల్లో కూడా పార్టీ సీఎం అభ్యర్థిని ప్రకటిస్తుందా? అనేది తాజాగా పార్టీలో, రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రాజస్థాన్, చత్తీస్‌గఢ్‌లో ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉన్నది. అలాంటిది ఒక్క మధ్యప్రదేశ్‌కు మాత్రమే సీఎం అభ్యర్థిని ప్రకటించడంతో ఎన్నికలు జరిగే ఇతర రాష్ట్రాలలో తేనెతుట్టెను కదిపినట్టు అయిందని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. సీఎం అభ్యర్థిని ప్రకటించాలనే డిమాండ్ ఎన్నికలు జరుగనున్న ఇతర రాష్ట్రాల నుంచి కూడా వచ్చే అవకాశం లేకపోలేదని అభిప్రాయపడుతున్నారు. ఇది కాంగ్రెస్ పార్టీ ఇరకాటంలో పడినట్టేనని విశ్లేషిస్తున్నారు.

### సహాయ నిరాకరణ ప్రమాదం

సీఎం అభ్యర్థిని ముందే ప్రకటిస్తే ఆ పదవి ఆశించే మిగతా నేతల నుంచి సహాయ నిరాకరణ ఎదురయ్యే ప్రమాదం ఉంటుందన్నది కాంగ్రెస్ యోచన. ఆ వ్యూహంతోనే కర్ణాటకలో సిద్ధరామయ్య, డీకే శివకుమార్ ఇద్దరికీ సీఎం పదవిపై ఆశలు కల్పించి పార్టీ గట్టెక్కింది. కానీ ఆ తర్వాత డీకేను పక్కనపెట్టి సిద్ధరామయ్యను సీఎం పీఠంపై కూర్చొబెట్టింది. తమ పార్టీ సీఎం అభ్యర్థిని ముందుగా ప్రకటించదని, ఇది తమ విధానం అని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ స్పష్టం చేశారు. అందుకు భిన్నంగా మధ్యప్రదేశ్‌లో సీఎం అభ్యర్థిని రాహుల్ ప్రకటించడంతో పార్టీ అధిష్ఠానం చిక్కుల్లో పడింది. ఎన్నికలు జరిగే ఇతర రాష్ట్రాలలో రాహుల్ సీఎం అభ్యర్థి చిచ్చు రాజేసిందని పార్టీ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

### జోరుగా పార్టీలో కుమ్ములాటలు

ఇప్పటికే రాజస్థాన్, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీల్లో గ్రూపుల కుమ్ములాటలు నడుస్తున్నాయి. అక్కడ సీఎం అభ్యర్థులను అధికారికంగా ప్రకటించలేదు. రాజస్థాన్‌లో సీఎం అశోక్ గెహ్లాట్‌కు వ్యతిరేకంగా సొంత పార్టీ నేత సచిన్ పైలట్ తిరుగుబాటు చేయగా.. కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తే సీఎం సీటు ఇస్తామని అంతర్గతంగా బుజ్జగించినట్టు పార్టీ వర్గాల సమాచారం. కానీ, మధ్యప్రదేశ్‌లో తాజాగా సీఎం అభ్యర్థిని ప్రకటన నేపథ్యంలో తన పేరును కూడా ప్రకటించాలని సచిన్ పైలట్ డిమాండ్ చేసే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. అదే జరిగితే పార్టీ ఇరకాటంలో పడక తప్పదని ఈ వర్గాలు అంటున్నాయి. ఇక్కడ సచిన్ ఒత్తిడికి లొంగితే చత్తీస్‌గఢ్, తెలంగాణ నుంచి కూడా సీఎం అభ్యర్థి ప్రకటనలపై డిమాండ్ వస్తే పరిస్థితి ఏంటని కాంగ్రెస్ వర్గాలు ఆందోళనలో పడినట్టు తెలుస్తున్నది.

### అధికారంలోకి వస్తే నేనే సీఎం..

తెలంగాణ నుంచి సీఎం పదవిని ఆశించే నాయకులు కనీసంగా అర డజన్ మంది వరకు ఉన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మధుయాష్కీ తదితరులంతా తమకు తామే సీఎం అభ్యర్థులుగా భావిస్తున్నారు. పార్టీ అధికారంలోకి వస్తే తానే సీఎంనని కొందరు బాహాటంగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా మధ్యప్రదేశ్‌లో పార్టీ నుంచి సీఎం అభ్యర్థిని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కాకుండా రాహుల్ గాంధీ ప్రకటించడం ఏమిటన్నది కూడా మరో వివాదంగా మారబోతుందా? అన్నది వేచి చూడాలి.



## లులు మాల్.. ట్రాఫిక్ జామ్

లులు మాల్‌కు కస్టమర్లు పోటెత్తడంతో రోడ్లపై వాహనాలతో ట్రాఫిక్ స్తంభించింది. కేపీహెచ్‌బీ కాలనీలో ఇటీవలే ప్రారంభించిన 'లులు మాల్'కు ఉదయం 11 గంటల నుంచి రాత్రి వరకు వినియోగదారులు భారీగా వస్తున్నారు. దీంతో కూకట్‌పల్లి అంబేద్కర్ వై జంక్షన్ నుంచి జేఎన్టీయూహెచ్ చౌరస్తా వరకు, కేపీహెచ్‌బీ కాలనీ ఫోరం మాల్ నుంచి జేఎన్‌టీయూహెచ్ చౌరస్తా వరకు వాహనాల రాకపోకలు స్తంభించిపోతున్నాయి. ఈ మార్గాల్లో 10 నిమిషాల ప్రయాణానికి గంటకుపైగా సమయం పట్టింది.

## రసవత్తర రాజకీయం

# భాగ్యలక్ష్మి గుడికి కాంగ్రెస్ పంచాయితీ!

- రూ.10 కోట్లు, 5 ఎకరాలు తీసుకున్నావని ఒప్పుకో.. లేదా అమ్మవారిపై ప్రమాణం చెయ్
- పీసీసీ చీఫ్ రేవంత్‌కు కొత్త మనోహర్‌రెడ్డి సవాల్
- తీసుకోకుంటే ఒట్టేయెచ్చుగా.. అగ్రనేతల గుసగుసలు
- 'కొత్త' ఆరోపణలతో రేవంత్‌పై ఫిర్యాదుల వెల్లువ
- ఈడీ వద్ద తేల్చుకుంటానన్న పార్టీ బహిష్కృత నేత

హైదరాబాద్ సిటీబ్యూరో/చార్మినార్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌లో టికెట్ల పంచాయితీ భాగ్యలక్ష్మి అమ్మవారి గుడికి చేరింది. 'అమ్మవారిపై ప్రమాణం..' మాట టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి దడ పుట్టిస్తున్నది. రూ.10 కోట్లు, ఐదెకరాల భూమి అంటూ కాంగ్రెస్ బహిష్కృత నేత కొత్త మనోహర్‌రెడ్డి చేసిన ఆరోపణల వ్యవహారం తారస్థాయికి చేరింది. రేపో మాపో ఈ పంచాయితీ ఈడీకి చేరనున్నది. గతంలో అమ్మవారిపై ప్రమాణం చేసిన రేవంత్‌రెడ్డికి మళ్లీ అదే పరిస్థితి ఎదురైంది. ఆరోపణలు వట్టివేనని వదిలేస్తే ఆయన గతంలో అమ్మవారిపై ప్రమాణం చేశారు కాబట్టి.. మరోసారి ఆయన నిరూపించుకోవాల్సిన అవసరం ఉంటుందని కాంగ్రెస్ అగ్రనాయకులు ఆయనపై ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం. కానీ, ఇందుకు రేవంత్‌రెడ్డి వారికి టచ్‌లోకి రాకపోవడం వెనక ఆంతర్యం ఏంటని ఆ పార్టీ నుంచి గుసగుసలు వినిపిస్తున్నాయి.

### రేవంత్ మౌనం.. అనుమానాలకు ఆస్కారం

అమ్మవారిపై ప్రమాణం చేయకపోతే రేవంత్‌రెడ్డి తప్పు చేసినట్టు ఒప్పుకున్నట్టేనని మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ బహిష్కృత నాయకుడు కొత్త మనోహర్‌రెడ్డి ఆదివారం చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయం వద్ద ప్రకటించారు. ఆయన మోసాలపై ఈడీకి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. గతంలో మునుగోడు ఎన్నికల్లో రూ.25 కోట్లు తీసుకున్నారని ఈటల చేసిన ఆరోపణలను ఖండించడానికి రేవంత్‌రెడ్డి అడగకకుండానే చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయానికి వచ్చి ప్రమాణం చేశాడని గుర్తు చేశారు. మరి ఇప్పుడు తాను అడుగుతున్నా స్పందన లేదని విమర్శించారు. చారిత్రక చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన మనోహర్‌రెడ్డి.. రేవంత్‌రెడ్డిపై తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రంలోని 119 స్థానాల్లో కాంగ్రెస్ టికెట్ల కోసం వందల కోట్లు తీసుకొని ఆయన అనుయాయులకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. మహేశ్వరం నియోజకవర్గంలో ఓ అభ్యర్థి నుంచి రూ.10 కోట్లు, 5 ఎకరాలు తీసుకొని టికెట్ ఇవ్వబోతున్నారని పేర్కొన్నారు. ఇది నిజం కాకపోతే భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఏ తప్పూ చేయలేదని ప్రమాణం చేయాలని డిమాండ్ చేశారు. మనోహర్‌రెడ్డి చేసిన డిమాండ్ గడువు పూర్తి కావొచ్చినా.. రేవంత్ నుంచి ఎలాంటి ప్రకటన రాకపోవడంతో అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి.

### నేనే సీఎం.. నీకు మంత్రి పదవి!

కాంగ్రెస్ పార్టీకి 40 ఏండ్లపాటు జీవితం ధారపోసిన వారందరిని పక్కనపెట్టి డబ్బుల ఆశతో కొత్తవారిని పార్టీలోకి రేవంత్ తీసుకొస్తున్నారని మనోహర్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్‌లో చేరుతున్న కసిరెడ్డి నారాయణరెడ్డి నుంచి రూ.6 కోట్లు తీసుకొని కాంగ్రెస్ టికెట్ కేటాయిస్తున్నారని ఆరోపించారు. ప్రతి అభ్యర్థి గెలుపోటములపై సర్వే చేసిన తర్వాతే టికెట్ కేటాయిస్తానన్న రేవంత్.. కసిరెడ్డిపై చేసిన సర్వే వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. పటాన్‌చెరు నుంచి అనిల్‌కుమార్ అనే వ్యక్తి ఇప్పటికే రేవంత్‌రెడ్డికి 12 కోట్లు ముడుపులు ఇచ్చినట్టు ప్రచారం కొనసాగుతున్నదని తెలిపారు. 'రేపు రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే. నేను ముఖ్యమంత్రిని కాబోతున్నా. నీకు రెవెన్యూశాఖను కేటాయిస్తా'నని రేవంత్‌రెడ్డి అనిల్‌కుమార్‌కు చెప్పారని, ఈ వివరాలన్ని ఈడీకి అందిస్తామని మనోహర్‌రెడ్డి వివరించారు. 'మా నియోజకవర్గంలో చల్ల నర్సింహారెడ్డి లాంటి వ్యక్తిని కాదని వేరే వాళ్లు డబ్బులు ఇస్తున్నారని మొదటి లిస్టులో వారి పేరు పెట్టి పంపిస్తున్నావంటే నీ అహంకారం ఎలాంటదో తెలుస్తుంది' అని పేర్కొన్నారు. డబ్బులిచ్చే వారికి లైన్ క్లియర్ చేయడం రేవంత్ పని అని.. అందుకే తనను పార్టీ నుంచి సస్పెండ్ చేయించారని పేర్కొన్నారు.

# కాంగ్రెస్‌లో డబ్బు సంచులకే ప్రాధాన్యం

- నిజాయితీగా కష్టపడేవారికి మొండి'చెయ్యి'
- కాంగ్రెస్‌కు మెదక్ డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి రాజీనామా
- పదేండ్ల కష్టానికి ఫలితం శూన్యమని లేఖలో ఆవేదన



మెదక్, అక్టోబర్ 01 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీలో ప్రజాబలం ఉన్న నాయకులకు విలువ లేదని, డబ్బు సంచులు, నోట్ల కట్టలకే ఆ పార్టీ అధిష్ఠానం ప్రాధాన్యం ఇస్తున్నదని మెదక్ డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి విమర్శించారు. తిరుపతిరెడ్డి మెదక్ అసెంబ్లీ టికెట్‌ను ఆశించగా.. మైనంపల్లి హన్మంతరావు తనయుడు రోహిత్‌కు టికెట్ కేటాయించే అవకాశం ఉండటంతో ఆయన తీవ్ర మనస్తాపం చెందారు. దీంతో ఆయన కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, ఆ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు కంఠారెడ్డి ఆదివారం తన రాజీనామా లేఖను విడుదల చేశారు. తిరుపతిరెడ్డి రాజీనామాతో మెదక్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి పెద్దషాక్ తగిలింది.

### పదేండ్లు కష్టపడినా ప్రయోజనం శూన్యం

కంఠారెడ్డి రాజీనామా లేఖ సారాంశం ప్రకారం.. 'నేను కాంగ్రెస్ పార్టీ కోసం పదేండ్లుగా కష్టపడి పనిచేసిన. అయినా ప్రయోజనం శూన్యం. పార్టీ బలోపేతానికి కష్టపడి పని చేసిన కార్యకర్తలకు కూడా స్థానం లేదు. ఈ మధ్య కాంగ్రెస్‌లో వరుసగా జరుగుతున్న పరిణామాలు చూస్తే ఎవరికైనా పార్టీని వీడాలని అనిపిస్తుంది. కాంగ్రెస్ పార్టీ కోసం చేసిన సేవలు, త్యాగాలు, పడ్డ కష్టాలను అధిష్ఠానం గుర్తించడం లేదు. పార్టీ టికెట్ల కేటాయింపులపై నిత్యం వస్తున్న ఆరోపణలు, వాటి పరిణామాలను చూసి నేను తీవ్రమైన మనోవేదనకు గురయ్యాను. పదేండ్లపాటు పార్టీ బలోపేతం కోసం శాయశక్తులా కృషి చేశాను. అంతేకాదు.. పోలీసు అక్రమ కేసుల్లో ఇరుక్కొని న్యాయస్థానాల చుట్టూ తిరుగుతున్నాను. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పనిచేసిన వ్యక్తులకు పార్టీలో చోటు కల్పించడంతో నేను మనస్తాపం చెందాను. అలాంటి వారి నాయకత్వంతో పార్టీకి మనుగడ లేదు. ప్రజలకు కూడా ఉపయోగం లేదు. కేవలం నోట్ల కట్టలను నమ్ముకునే వారు.. రేపు రాష్ట్రాన్ని, తెలంగాణ ఆత్మగౌరవాన్ని నడి బజారులో నవ్వుల పాలు చేయడం ఖాయం' అని ఆ లేఖలో పేర్కొన్నారు.

### డబ్బులిచ్చేవారికే సీట్లు

కాంగ్రెస్ పార్టీలో నిజాయితీగా ఉంటూ పనిచేసే నాయకులకు సీట్లు దక్కడం లేదని, డబ్బులిచ్చేవారు కాంగ్రెస్ వ్యతిరేకులైనా సరే.. వారికే పార్టీ అధిష్ఠానం టికెట్లు ఇస్తున్నదని కంఠారెడ్డి తిరుపతిరెడ్డి విమర్శించారు. కాంగ్రెస్‌లో డబ్బు సంచులు ఉన్న నాయకులకే సీట్లు దక్కే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. ప్రజాబలం ప్రాతిపదికన కాకుండా ధన బలానికే ప్రాధాన్యం ఇస్తున్నారని, ఈ విషయంలో ఏఐసీసీ అధ్యక్షుడితోపాటు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ లాంటి అగ్రనాయకులు కూడా మౌనం వహించడం తనకు ఎంతో బాధ కలిగించిందని తన రాజీనామా లేఖలో కంఠారెడ్డి తిరుపతిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

## కాంగ్రెస్ టికెట్ రాకపోతే రెబల్‌గా పోటీ

**జనం నా వెంట.. నాయకులు జూపల్లి వెంట**
**మీడియాతో టీపీసీసీ సభ్యుడు చింతలపల్లి**



కొల్లాపూర్, అక్టోబర్ 1 : 'సర్వేలన్నీ నా వైపే ఉన్నాయి.. నాపట్ల జనం సానుభూతితో ఉన్నారు. నాయకులు మాత్రం మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు వెంట ఉన్నారు. నాకు కాంగ్రెస్ అధిష్ఠానం టికెట్ కేటాయించకపోతే కాంగ్రెస్ జెండా పట్టుకునే రెబల్‌గా పోటీ చేస్తా'నని టీపీసీసీ సభ్యుడు చింతలపల్లి జగదీశ్వర్‌రావు స్పష్టం చేశారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో తాను ఏర్పాటు చేసుకున్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. జూపల్లి నెల రోజుల కిందట వచ్చి తనకే టికెట్ కావాలని అనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధిష్ఠానం సర్వే ప్రకారం టికెట్ తనకే కేటాయించాలని కోరారు. ఎంత మంది పోటీలో ఉన్నా.. జనం తన వెంటే ఉన్నారని స్పష్టం చేశారు. తాను చాలా ఏండ్లుగా కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డా.. పడుతున్నా.. ఎన్నో మీటింగ్‌లు నిర్వహించానని తెలిపారు.